క్లుప్తంగా

భానుడి భగభగలు



బోసిబోయిన పాతపట్నం మార్కెట్ రోడ్డు

పాతపట్నం: శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా గడిచిన వారం రోజులుగా ఎండల తీవ్రత ఎక్కువైంది. నాలుగు రోజుల క్రితం వరకు 39 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, ప్రస్తుతం 42 డిగ్రీలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ఇంటి నుంచి బయటకు వెళ్లాలని, అలాంటప్పుడు గొడుగు, టోపీ వినియోగించాలని సూచిస్తున్నారు. వదులుగా ఉండే వస్త్రాలు ధరించాలని, ద్రవ పదార్థాలు రోజుకు నాలుగు నుంచి ఐదు లీటర్లు తీసుకోవాలని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల ఉదయం 10 గంటల నుంచే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వినియోగదారులు లేక వ్యాపారాలు వెలవెలబోతున్నాయి.

రక్షణ గోడ నిర్మించాలి



రక్షణ గోడ లేని నెల్లిమెట్ట రెల్లిగెడ్డ వంతెన

ఆమదాలవలస రూరల్: మండలంలోని నెల్లిమెట్ట గ్రామం సమీపంలో ఉన్న రెల్లిగెడ్డ సాగునీటి కాలువపై ఉన్న వంతెనకు రక్షణ గోడ నిర్మించాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు. రక్షణ గోడ లేకపోవడం వలన రాత్రి సమయాల్లో పలువురు ప్రమాదాలకు గురవుతున్నట్లు చెబుతున్నారు. గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి ఈ వంతెనపై నుంచి ఉన్నందున, రోడ్డు ఎత్తుగా ఉండడంతో ప్రమాదాలకు నిలయంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వంతెనపై ప్రహరీ గోడ నిర్మిస్తే ప్రమాదాలను కొంతవరకు నివారించవచ్చునని చెబుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకుడు

బూర్జ: మండలంలోని పెద్దపేట గ్రామంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఆర్ప్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా రక్తదాన శిబిరాన్ని శనివారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి చైర్మన్ పి.జగన్మోహన్‌రావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రారంభించి 30 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సంస్థ డైరెక్టర్ తెలియజేశారు. దీనిలో భాగంగా 102 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం రమేష్ కుమార్, వరప్రసాద్, ఆర్ప్ సంస్థ కో–ఆర్డినేటర్ నూక అనూప్, సీఈవో బి.శంకరరావు పాల్గొన్నారు.

12 మందిపై బైండోవర్ కేసులు



మద్యం అమ్మినవారిని హెచ్చరిస్తున్న తహసీల్దార్ భానుమతి

సారవకోట: మండలంలో ఎన్నికల ముందు అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు చేపడుతున్న 12 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి, వారిని తహసీల్దార్ భానుమతి ముందు ఎస్‌ఈబీ అధికారులు శనివారం హాజరుపర్చారు. మరలా అక్రమంగా మద్యం విక్రయాలు చేపడితే రూ.2 లక్షల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఆమెతో పాటు డిప్యూటీ తహసీల్దార్ మధుబాబు ఉన్నారు.

బాధ్యతగా పనిచేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న హరిప్రసాద్

సారవకోట: మండలంలో 108 వాహన సిబ్బంది మరింత బాధ్యతగా పనిచేయాలని 108 వాహన జిల్లా మేనేజర్ బొమ్మాళి హరిప్రసాద్ సూచించారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని 108 వాహనంలో పరికరాల పనితీరు, సిబ్బంది హాజరు, వాహనం పనితీరును పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలిచ్చారు. మండలంలో జాతీయ రహదారిలో ట్రాఫిక్ పెరిగిందని, వాహనాల రాకపోకలు, రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఖరీఫ్‌కు సమాయత్తం

ఖరీఫ్ సీజన్ వచ్చేస్తోంది. ఎప్పటిలాగానే రైతులు పొలం పనుల్లో బిజీగా మారుతున్నారు. అదునుకు వర్షాలు పడడంతో వ్యవసాయ పనులు చేస్తున్నారు. ఇటీవల కురిసిన అడపాదడపా వర్షాలకు రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ పొలం గట్లును చదును చేస్తున్నారు. మరికొంత మంది రైతులు వేసవి దుక్కులు ముమ్మరం చేస్తున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండడంతో ఈ ఏడాది మంచిగా దిగుబడులు రావాలని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

– ఆమదాలవలస రూరల్/ఎల్.ఎన్.పేట



ఆమదాలవలస రూరల్: చెవ్వాకులపేట వద్ద పొలం గట్లును చదును చేస్తున్న రైతులు



ఆమదాలవలస రూరల్: రామచంద్రాపురంలో పొలం దున్ని సిద్ధం చేస్తున్న రైతులు



ఎల్.ఎన్.పేట: శ్యామలాపురం వద్ద పొలం దున్నుతున్న రైతు



ఎల్.ఎన్.పేట: చింతలబడవంజ వద్ద ట్రాక్టర్‌తో దుక్కి చేస్తున్న దృశ్యం

ఆక్రమణలు అడ్డగింత



పనులను అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

నరసన్నపేట: నియోజకవర్గ కేంద్రం నరసన్నపేటలో చెరువుల ఆక్రమణలు శృతి మించుతున్నాయి. ఇటీవల రాజుల చెరువు, గోరువాని చెరువు గట్టులను, కొత్తకర్ర చెరువు గర్భంలో ఇంటి నిర్మాణానికి కొంత స్థలాన్ని ఆక్రమణలకు పాల్పడగా అధికారులు స్పందించి అడ్డుకున్నారు. ఇప్పుడు తాజాగా నరసన్న చెరువు గర్భాన్ని రెడ్డికిపేటకు వెళ్లే దారిలో కొందరు శనివారం మట్టిపోసి ఆక్రమణలకు పాల్పడ్డారు. ఈ సమాచారం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు లక్ష్మణరావు, వీఆర్‌ఏ రామారావు, సర్వే చైన్‌మెన్ రవి తహసీల్దార్ కనకారావు ఆదేశాలతో వెళ్లి మట్టి కప్పడాన్ని అడ్డుకున్నారు. గొట్టిపల్లి రెవెన్యూ 94/1 సర్వే నంబర్‌లో నరసన్నపేట చెరువు ఉందని, కొంతభాగం ఎన్‌హెచ్‌లో పోగా మిగిలిన భాగం రోడ్డుకు రెండు వైపులా ఉంది. దీంట్లో కొంత భాగాన్ని రెడ్డికిపేట వైపు ఆక్రమణదారులు శుక్రవారం రాత్రి మట్టిపోసి కప్పుతున్నారు. ఇక్కడ సెంటు స్థలం రూ.10 లక్షలకు పైనే పలుకుతోంది. దీంతో చెరువు భాగాన్ని ఆక్రమించుకోవడానికి కొందరు ప్రయత్నించగా రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. అనుమతి లేకుండా చెరువులు ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



చెరువు గర్భంలో మట్టిపోసిన దృశ్యం

సక్రమంగా విద్యా కానుక కిట్లు పంపిణీ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో విజయకుమారి

హిరమండలం: పాఠశాలల ప్రారంభం నాటికి విద్యా కానుక కిట్లు సక్రమంగా పంపిణీ చేయాలని టెక్కలి డిప్యూటీ డీఈవో ఆర్.విజయకుమారి ఆదేశించారు. శనివారం ఆమె విద్యాకానుక కిట్ల స్పాట్ పాయింట్‌ను పరిశీలించారు. పదో తరగతి అడ్వాన్స్డ్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల ప్రారంభం నాటికి నాడు–నేడు పనులు పెండింగ్‌లో ఉండకుండా చూడాలన్నారు. విద్యాకానుక కిట్లను కూడా సకాలంలో అందించాలన్నారు. ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. లోటుపాట్లు ఉంటే ఎప్పటికప్పుడు ఎంఈవోకు తెలియజేయాలన్నారు. ఆమెతో పాటు ఎంఈవో కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

‘నాడు–నేడు పనులు పూర్తి చేయాలి’



పనులు పరిశీలిస్తున్న ఎంఈవో రాంబాబు

హిరమండలం: ఈనెల ఆఖరు నాటికి నాడు–నేడు పనులు పూర్తి చేయాలని ఎంఈవో కె.రాంబాబు ఆదేశించారు. మండల కేంద్రంలో జరుగుతున్న నాడు–నేడు పనులను శనివారం ఆయన పరిశీలించారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్ర భవనాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ విషయంలో ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు సహకరించాలని కోరారు. సకాలంలో పనులు చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

‘బెట్టింగులు నిర్వహిస్తే చర్యలు’

కొత్తూరు: ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరగనున్న నేపథ్యంలో ఎవరైనా బెట్టింగులకు పాల్పడినట్లయితే కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్‌ఐ ఎంఏ అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ ఉన్నందున ఫైనల్ మ్యాచ్‌కు స్క్రీన్‌లు ఏర్పాట్లు చేయకూడదన్నారు. బాణాసంచాలు పేల్చకూడదని పేర్కొన్నారు.

బాలల హక్కులు హరిస్తే నేరం

కొత్తూరు: బాలల హక్కులు హరించేవిధంగా ఎవరైనా వ్యవహరిస్తే చట్టరీత్యా నేరమని కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి కె.రాణి అన్నారు. అంతర్జాతీయ బాలల అపహరణ నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి కె.రాణి మాట్లాడుతూ.. బాలలతో పనులు చేయించడం నేరమన్నారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.అప్పారావు, ఎస్‌ఐ ఎంఏ అహ్మద్, వి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటలపై ప్రత్యేక దృష్టి

సారవకోట: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానవన పంటలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఉపాధి హామీ పథకం ఏపీడీ మురళీకృష్ణ తెలిపారు. శనివారం ఆయన మండలంలోని అన్నుపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి, అనంతరం స్థానిక కార్యాలయంలో సిబ్బందితో పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25 సెంట్లు నుంచి 5 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు ఉద్యానవన పంటలైన మామిడి, సపోటా, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, ఆయిల్ పాం తదితర పంటల పెంపకానికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. మూడు సంవత్సరాల పాటు మొక్కల పెంపకానికి అయ్యే నిర్వహణ ఖర్చును ఉపాధి హామీ పథకం ద్వారా అందించనున్నట్లు తెలిపారు. సారవకోట మండలంలో 70 పనులు జరుగుతున్నాయని, 9,300 మంది వేతనదారులు పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయనతో పాటు ఏపీవో నారాయణరావు ఉన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఏపీడీ మురళీకృష్ణ

భక్తిశ్రద్ధలతో పూజలు



పొందూరు: వేంకటేశ్వరుని కల్యాణానికి రాట వేస్తున్న దృశ్యం



నరసన్నపేట: చంద్రప్రభ వాహన సేవలో వేంకటేశ్వర స్వామి

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామ సమీపంలో వంశధార నదీతీరంలో కొలువైన బంగారమ్మ తల్లి అమ్మవారి పెద్ద పండగల్లో భాగంగా అమ్మవారి జంగిడి ఊరేగింపు కార్యక్రమాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈనెల 28వ తేదీ వరకు జరగనున్న అమ్మవారి పెద్ద పండగల్లో భాగంగా జంగిడి ఊరేగింపుగా తీసుకుని వెళ్లి, అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. పండగలకు వస్తున్న బంధువులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అమ్మవారికి పూజలు నిర్వహించేందుకు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు.

చంద్రప్రభ వాహన సేవ

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వరాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం స్వామివారికి చంద్రప్రభ వాహన సేవ నిర్వహించారు. పెద్దపేటతో పాటు ప్రధాన వీధుల్లో చంద్రప్రభ వాహనంలో స్వామివారు ఊరేగారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి జాతర ప్రారంభం

పొందూరు: మండలంలోని తండ్యాం పంచాయతీ పరిధి మన్నెపేట కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామి 33వ జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అలివేలి మంగమ్మ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణానికి రుత్వీకులు గన్నవరపు రాంబాబు కల్యాణ రాట వేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు తిరువీధి మహోత్సవం జరిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఎల్.ఎన్.పేట: అమ్మవారి జంగిడి ఊరేగిస్తున్న దృశ్యం

ప్రశాంత వాతావరణానికి సహకరించాలి



సరుబుజ్జిలి: మాట్లాడుతున్న ఎస్‌ఐ నిహార్



పాతపట్నం: తీమరలో మాట్లాడుతున్న సీఐ సాయి

పాతపట్నం: జూన్ 4వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికలు లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ నల్లి సాయి కోరారు. మండలంలోని తామర, తీమర, సీది గ్రామాల్లో ప్రజలతో సమావేశాన్ని శనివారం నిర్వహించారు. గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. గొడవలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహ్మద్ యాసీన్, ఏఎస్‌ఐ టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా నేతలు సహకరించాలని ఎస్‌ఐ బి.నిహార్ కోరారు. మండల కేంద్రంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో సమావేశం శనివారం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు గుమిగూడి సమావేశాలు, ర్యాలీలు ఏర్పాటు చేయవద్దన్నారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలు, గుర్తింపు లేని వ్యక్తులు ఉన్నట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలీసుల కార్డన్ సెర్చ్



మెళియాపుట్టి: స్వాధీనం చేసుకున్న నాటుసారాతో పోలీసులు

బూర్జ: మండలంలోని చీడివలస గ్రామంలో ఎస్‌ఐ జి.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా వివాదస్పద వ్యక్తులు, అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అలాగే పశువుల శాలలు, గడ్డివాములు క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ద్విచక్ర వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. ఎటువంటి పత్రాలు లేని మూడు ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. వాహనదారులు తగిన పత్రాలు కలిగి ఉండాలన్నారు. పత్రాలు లేని వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి: నాటుసారా తయారీ అత్యంత నేరమని పాతపట్నర సీఐ నల్లి సాయి అన్నారు. మండలంలోని మర్రిపాడు–కె గ్రామ పంచాయతీ పరిధిలోని సవర మురికింటి భద్ర గ్రామంలో కార్డన్ సెర్చ్ శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో మెళియాపుట్టి ఎస్‌ఐ రాజేష్, పాతపట్నం ఎస్‌ఐ మహ్మద్ యాసిన్ తదితరులు పాల్గొన్నారు.



బూర్జ: చీడివలసలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

సమష్టిగా అభివృద్ధి చేద్దాం

సరుబుజ్జిలి: సభ్యులందరం సమష్టిగా మండలాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ కిల్లి రమాదేవి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి పూర్తిస్థాయి సిబ్బంది హాజరవ్వకపోవడంతో కాకపోవడంతో పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు కోసం చర్చించే సమయంలో పూర్తిస్థాయి అధికారులు లేకపోవడం వలన సమావేశాలు పెట్టినా ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ ఉండడంతో శాఖల వారీగా చర్చ నిర్వహించకుండానే తూతూమంత్రంగా ముగించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ జీవీ శివానందమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ కిల్లి రమాదేవి


జైల్లో సౌకర్యాలపై ఆరా

నరసన్నపేట: స్థానిక సబ్ జైలులో రిమాండ్ ఖైదీలతో పాటు ఇతర ఖైదీలకు అందుతున్న సదుపాయాలపై నరసన్నపేట కోర్టు సివిల్ జడ్జి సి.హరిప్రియ ఆరా తీశారు. శనివారం జైలుకు వెళ్లి రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. అవసరమైన వారికి న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణగా మెలగాలన్నారు. కార్యక్రమంలో ఏపీపీ గొండు సత్యనారాయణ, న్యాయవాదులు ఆర్.కృష్ణంనాయుడు, తూలుగు మధు, డి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి హరిప్రియ

వర్షంతో ఊరట...



ఎల్.ఎన్.పేట: నల్లగా కమ్మేసిన మేఘాలు

సరుబుజ్జిలి: మండలంలో శనివారం సాయంత్రం వర్షం కురవడంతో ప్రజలు వేడి నుంచి ఉపశమనం పొందారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నీరునిల్వ చేరింది.

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షంతో ఊరట లభించింది. శనివారం ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. మబ్బులు రావడంతో పాటు వాతావరణం చల్లగా మారింది. కొంత సమయం తర్వాత ఎండ వచ్చినప్పటికీ సాయంత్రానికి మేఘాలు నల్లగా కమ్మేసి వర్షం కురవడం ప్రారంభం అయింది. వర్షంతో వంశధార నదీతీర గ్రామాలైన దబ్బపాడు, వాడవలస, మిరియాపల్లి, లక్ష్మీనర్సుపేట, బసవరాజుపేట తదితర గ్రామాల్లో కోత కోసిన హైబ్రీడ్ పెసర పంటకు నష్టం జరిగిందని బాధిత రైతులు తెలిపారు. వేసవి దుక్కులకు వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు వివరించారు.

బూర్జ: మండలంలో శనివారం సాయంత్రం కొద్దిపాటి వర్షం కురిసింది. దీంతో ప్రజలు వేడిమి నుంచి ఊరట పొందారు. వర్షం పెరిగితే దుక్కులు చేసుకోవచ్చని రైతులు అభిప్రాయపడ్డారు.



ఎల్.ఎన్.పేట: తురకపేటలో కురుస్తున్న వర్షం



సరుబుజ్జిలి: పీహెచ్‌సీ ఆవరణలో వర్షపునీరు